సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

సోమవారం । 27 । మే । 2024



కల్యాణ వైభోగమే..

నారాపురస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం సాయంత్రం భూదేవి, శ్రీదేవి సమేత నారాపుర వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. -8లో



సౌత్‌జోన్ క్రికెట్ పోటీలకు సిద్ధం

కడపలోని కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం క్రీడా మైదానాలు వేదికగా అంతర్ జిల్లాల వన్డే క్రికెట్ మ్యాచ్‌లు ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్నాయి. -8లో

గరిష్టం/కనిష్టం
38.2/26.8

వాతావరణం

జిల్లాలో ఆదివారం 26.8 – 38.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 8.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

రేపు జాబ్ మేళా

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక మైదుకూరు రోడ్డులోని నాగార్జున ఐటీఐలో మంగళవారం ఉదయం 9 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. కొప్పర్తి సమీపంలోని ఎలక్ట్రానిక్ కంపెనీలో ఉద్యోగాల కోసం ఈ మేళా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వివరాలకు 82475 75462 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సీఎం వైఎస్ జగన్‌కు ప్రజల ఆశీస్సులు



దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డికి నివాళి అర్పిస్తున్న రత్నాకర్, చిల్లా కిరణ్‌రెడ్డి తదితరులు

రాజంపేట: ప్రజల ఆశీస్సులతో వైఎస్ జగన్ దిగ్విజయం సాధించబోతున్నారని ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి (ఉత్తర అమెరికా) పండుగాయల రత్నాకర్ అన్నారు. ఆదివారం యూఎస్ఏ సోషల్ మీడియా కో–కన్వీనర్ చిల్లా కిరణ్‌రెడ్డి, పలువురు ఎన్నారైలతో కలిసి ఇడుపులపాయ వైఎస్సార్ ఘాట్‌ను వారు సందర్శించారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సమాధి వద్ద నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ జూన్ 9న విశాఖలో సీఎంగా వైఎస్ జగన్ ప్రమాణస్వీకారం చేయడం తథ్యమని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రతి ఇంటికి చేసిన మంచి ఆయనను గెలిపించబోతోందని పేర్కొన్నారు. యూఎస్ఏ సోషల్ మీడియా కో–కన్వీనర్ చిల్లా కిరణ్‌రెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో అత్యధికంగా మహిళలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారంటే, ఇందుకు నిదర్శనం సీఎం వైఎస్ జగన్ ప్రతి ఇంటికి మేలు చేయడమేనన్నారు.

పవిత్ర హజ్‌యాత్ర అవకాశమే అదృష్టం



మాట్లాడుతున్న మత గురువు మౌలానా మౌల్వి షేక్ రషీద్ అహ్మద్

కడప కల్చరల్: పవిత్రమైన హజ్ యాత్ర చేసే అవకాశం రావడమే ముస్లింల జీవితాలకు గొప్ప అదృష్టమని మత గురువు మౌలానా మౌల్వి షేక్ రషీద్ అహ్మద్ అన్నారు. ఆదివారం కడపలోని కృష్ణా సర్కిల్‌లో సంస్థ కార్యాలయంలో హజ్ యాత్రికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అతిథులుగా రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ బీఎస్ గౌసులాజం, ఎమ్మెల్సీ సి.ఇషాక్‌బాషా, నగర ప్రముఖులు ఎస్‌బీ అహ్మద్‌బాషా కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్ ఇషాక్ అలీ, సయ్యద్ హిదాయతుల్లాలు హాజరై మాట్లాడారు. జీవితంలో హజ్ యాత్ర చేసే అవకాశం రావడాన్ని ప్రతి ముస్లిం అదృష్టంగా భావించవచ్చన్నారు. ఈ సందర్భంగా ప్రపంచ శాంతి కోసం ప్రార్థించాలని సూచించారు. రషీద్ అహ్మద్ హజ్ యాత్ర నిబంధనల గురించి వివరించారు. అనంతరం యాత్రికులకు వ్యాక్సినేషన్ చేసి హజ్‌యాత్రలో ఉపయోగపడే వస్తువులతో కూడిన కిట్లను అందజేశారు.

ఆన్‌లైన్‌లో మూల్యాంకనం

- సాంకేతికతను అందిపుచ్చుకున్న ఇంటర్మీడియట్ బోర్డు
- ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల జవాబుపత్రాలు ఆన్‌లైన్‌లో దిద్దనున్న ఎగ్జామినర్లు



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: ఎన్నడూ లేని విధంగా ఇంటర్మీడియట్ బోర్డు సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. ఈనెల 24 నుంచి జరుగుతున్న ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల జవాబుపత్రాలను ఆన్‌లైన్‌లో దిద్దే ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఈ మేరకు జిల్లా అధికారులకు రాష్ట్ర ఇంటర్ విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీనిపై అధ్యాపకులకు శిక్షణ కూడా నిర్వహించారు. జూన్ 1 నుంచి ఆన్‌లైన్ మూల్యాంకనం ప్రారంభమవుతుందని ఇంటర్ అధికారులు వెల్లడిస్తున్నారు.

- జిల్లావ్యాప్తంగా 37 పరీక్ష కేంద్రాల్లో ప్రారంభమైన పరీక్షలను ఫస్ట్ ఇంటర్ 12043 మంది, ద్వితీయ సంవత్సరం 5645 మంది రాస్తున్నారు.పరీక్షలు పూర్తికాగానే మూల్యాంకన ప్రక్రియను త్వరితగితిన పూర్తి చేసి ఫలితాలు సత్వరమే వెల్లడించేందుకు ఇంటర్మీడియట్ బోర్డు వినూత్న పద్ధతిని ప్రారంభించనుంది. ఆన్‌లైన్‌లో త్వరగా మూల్యాంకనం చేసే విధంగా పకడ్బందీ అధికారులు ఏర్పాట్లు చేపడుతున్నారు. గతంలో ప్రతి జిల్లాలోనూ మూల్యాంకనం కేంద్రం ఏర్పాటు చేసేవారు. వార్షిక పరీక్షలకైతే 20 రోజులు, సప్లిమెంటరీకైతే 12 రోజుల పాటు మూల్యాంకనాన్ని నిర్వహించేవారు. సప్లిమెంటరీ పరీక్షల తర్వాత చేపట్టే మూల్యాంకనం సరిగ్గా జూన్ 1 నుంచి మొదలవుతుంది. అప్పుడప్పుడే కళాశాలలు పునఃప్రారంభం అవుతాయి. ఆ సమయంలోనే విద్యార్థుల అడ్మిషన్లు కూడా జరుగుతాయి. ఈ తరుణంలో అధ్యాపకులందరూ 'స్పాట్'కేంద్రంలో ఉండాల్సిన పరిస్థితి ఉండేది. దీంతో తరగతుల నిర్వహణకు ఆటంకం కలిగేది. అడ్మిషన్లకు ఇబ్బంది పడాల్సి వచ్చేంది. ఇదే అదునుగా భావించి ప్రైవేట్ కళాశాలల నిర్వాహకులు అడ్మిషన్లు బాగా చేసుకునేవారు. ప్రభుత్వ కళాశాలల్లో ఈ సమస్యను అధిగమించి అధ్యాపకులందరూ కళాశాలల్లోనే అందుబాటులో ఉండేందుకే ఈ ఆన్‌లైన్ మూల్యాంకన విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

తరగతులకు ఆటంకం లేకుండా.....

ఎగ్జామినర్లు కళాశాలల్లో తరగతులను నిర్వహించుకుంటూ వీలైనప్పుడు పేపర్లను మూల్యాంకనం చేసుకోవచ్చు. మూల్యాంకనం ఉదయం 8 గంటలనుంచి ప్రారంభించవచ్చు. ప్రతి ఎగ్జామినర్ 'టీక్యూఐడీ' ద్వారా లాగిన్ అయి వెంటనే పాస్‌వర్డ్ మార్చుకోవాలి. తర్వాత వెబ్‌కెమెరా ముందు తన ఫొటో క్యాప్చర్ చేసి లాగిన్ అవుతారు. ముందుగా ఐదు ప్రాక్టీస్ పేపర్లు మూల్యాంకనం చేసిన తర్వాత రెగ్యులర్ పేపర్లు అందుబాటులోకి వస్తాయి. ఒక్కో ఎగ్జామినర్‌కు రోజుకు గరిష్టంగా 50 జవాబుపత్రాలు అందుబాటులో ఉంటాయి. విధులకు కేటాయించే ఎగ్జామినర్లే ఆన్‌లైన్‌లో జవాబుపత్రాలను దిద్దుతారు, మరోకరు లాగిన్ అయ్యి దిద్దేందుకు ఆస్కారం ఉండదు.

అమల్లోకి ఆర్ఆర్ఎస్‌సీలు....

మాన్యువల్‌గా జవాబు పత్రాలను దిద్దేటప్పుడు జిల్లా కేంద్రంలో డీఆర్‌డీసీ (జిల్లా రీ కలెక్షన్ డిస్ట్రిబ్యూషన్‌సెంటర్)అందుబాటులో ఉండేది. నూతన విధానంలో డీఆర్‌డీసీ బదులు ఆర్ఆర్ఎస్‌సీ (రీజనల్ రెసిప్షన్ స్కానింగ్ సెంటర్) అందుబాటులోకి తీసుకురానున్నారు. గతంలో డీఆర్‌డీసీ విధానంలో ప్రతి జిల్లాలో జవాబుపత్రాలను సేకరించి ఎంపిక చేసే జిల్లాలను జంబ్లింగ్ విధానంలో పంపేవారు. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఆరు కేంద్రాలకు జవాబుపత్రాలను పంపుతారు. సంబంధిత కేంద్రాలకు జవాబుపత్రాలు వెళ్లిన వెంటనే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి మూల్యాంకనానికి చర్యలు చేపడతారు.

పొరపాట్లకు ఆస్కారం లేకుండా..



ఆన్‌లైన్ మూల్యాంకనంలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఉండదని అధికారులు వెల్లడిస్తున్నారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం జవాబు పత్రాలను స్కాన్ చేసి ఏఈగా ఎంపిక చేసిన అధ్యాపకుడికి ఆన్‌లైన్లో పంపిస్తారు. ప్రత్యేకంగా కేటాయించే కోడ్ ఆధారంగా అధ్యాపకుడు కంప్యూటర్, ల్యాప్‌టాప్ ఓపెన్ చేసి తాను పనిచేసే కాలేజీ లోనే ఆ జవాబు పత్రాలను ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ఎప్పుడైనా మూల్యాంకనాన్ని నిర్వహించవచ్చు. ఈ ప్రక్రియను సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే నిర్వహించాలి. ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తవని ఇంటర్ అధికారులు చెబుతున్నారు. మ్యానువల్‌గా మూల్యాంకనం చేసే సమయంలో మార్కుల టోటలింగ్‌లో పొరబాట్లు దొర్లడం జరుగుతుంటాయని, ఆన్‌లైన్ మూల్యాంకన విధానంతో ఇలాంటి వాటికి తావు ఉండదని ఇంటర్ అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఒక ప్రశ్న తర్వాత మరో ప్రశ్న..

ఆన్‌లైన్‌లో మూల్యాంకనం చేసేటప్పుడు ఒక ప్రశ్నకు విద్యార్థి రాసిన సమాధానాన్ని ఎగ్జామినర్ పూర్తిగా మూల్యాంకనం చేశాకే మరో ప్రశ్న డిస్‌ప్లే అవుతుంది. ఇలా ప్రతి ప్రశ్నను తప్పని సరిగా పరిశీలించి మార్కులను నమోదు చేస్తారు. అన్ని ప్రశ్నలు పూర్తి అయ్యాకే ఫైనల్ సబ్మిట్ వస్తుంది. విద్యార్థులు జవాబు రాసినా, రాయకపోయినా అన్ని ప్రశ్నలు పరిశీలించాల్సి ఉంటుంది. ఈ విధానం వల్ల ఏ ఒక్క ప్రశ్నకు మార్కులు వేయడం మరిచిపోయే అవకాశం ఉండదని ఎగ్జామినర్లు వెల్లడిస్తున్నారు. ఒక ప్రశ్నకు మ్యాగ్జిమం వేయాల్సిన మార్కులకంటే ఎక్కువ వేసినా ఆన్‌లైన్ తీసుకోదని వారు చెబుతున్నారు.

మంచి విధానం



సప్లిమెంటరీ పరీక్షల జవాబుపత్రాలను ఆన్‌లైన్‌లో మూల్యాంకనం చేసే ప్రక్రియకు ఉన్నతాధికారులు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాదే ఈ సరికొత్త విధానం అమల్లోకి వస్తోంది. ఆన్‌లైన్ మూల్యాంకనంపై ఇప్పటికే లెక్చరర్లకు అవగాహన కల్పించాం. . సాంకేతికతను అందిపుచ్చుకుని తీసుకొస్తున్న ఈ విధానం చాలా మంచిగా ఉంది. ఈ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాం.

– బండి వెంకటసుబ్బయ్య, డీవీఈఓ(ఎఫ్ఏసీ), ఇంటర్ విద్య, వైఎస్సార్‌జిల్లా

ఆన్‌లైన్ మూల్యాంకనంపై అధ్యాపకులకు శిక్షణ



మాట్లాడుతున్న ఆర్ఐఓ బండి వెంకటసుబ్బయ్య

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం నిర్వహిస్తున్న ఇంటర్ అడ్వాన్స్‌డ్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ఆన్‌లైన్‌లో నిర్వహించబోతున్నామని ఇంటర్ బోర్డు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సుబ్బారావు పేర్కొన్నారు. ఆన్‌లైన్ మూల్యాంకనంపై ఆర్ఐఓ బండి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఆదివారం కడపలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, పొద్దుటూరులోని దీప్తి జూనియర్ కళాశాల, పులివెందులలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వ, ఎయిడెడ్, కేజీబీవీ, సోషల్ వెల్ఫేర్, మోడల్ స్కూల్స్, ప్రైవేట్ జూనియర్ కళాశాల ఇంటర్ అధ్యాపకులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. టీచర్ యూఐడీ నంబర్ ఉన్న ప్రతి లెక్చరర్ హాజరై శిక్షణను తీసుకున్నారు. ఇంటర్ పరీక్షల తర్వాత ఆన్‌లైన్ మూల్యాంకనం ఏ విధంగా నిర్వహించాలి, మార్కులు ఎలా వేయాలనే అంశాలపై అధ్యాపకులకు వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా మూడు కేంద్రాలకు 500మంది అధ్యాపకులు హాజరయ్యారని ఆర్ఐఓ బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ శిక్షణలో తెలుసుకున్న అంశాలను మూల్యాంకన సమయంలో జాగ్రత్తగా పాటించాలన్నారు.



శిక్షణకు హాజరైన అధ్యాపకులు

అశ్వ వాహనంపై చెన్నకేశవుడు



వెల్లాలలో అశ్వ వాహనంపై ఊరేగుతున్న ఉత్సవ మూర్తులు

రాజుపాళెం: మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజైన ఆదివారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వాములను అశ్వ వాహనంపై ఊరేగించారు. ముందుగా స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పల్లకిపై కొలువుదీర్చారు. అనంతరం పురవీధుల్లో ఊరేగించారు. దేవస్థానాల చైర్మన్ బి.జగదీశ్వర రెడ్డి, ఈఓ నరసయ్య, సీనియర్ అసిస్టెంట్ రామమోహన్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.


హుండీ ఆదాయం లెక్కింపు: మండలంలోని వెల్లాలలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల ఆలయాల్లో తిరునాల సందర్భంగా శని, ఆదివారాలకు సంబంధించి ఏర్పాటు చేసిన తాత్కాలిక హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఆలయ చైర్మన్ బి.జగదీశ్వర రెడ్డి, పర్యవేక్షణాధికారి ఆర్ఆర్ నరసింహా సింగ్, ఈఓ బీవీ నరసయ్యల ఆధ్వర్యంలో లెక్కింపు చేపట్టారు. అందులో రూ.1,34,137 వచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రామమోహన్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

క్రికెట్ ఎంపికలకు 150 మంది హాజరు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి అండర్–16 క్రికెట్ ఎంపికలకు క్రీడాకారుల నుంచి స్పందన లభించింది. ఈ ఎంపికలను క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్–16 వయస్సు క్రికెట్‌లో ఎంతో కీలకమైనదన్నారు. ఉన్నతశ్రేణి క్రికెట్ ఆడేందుకు ఇందులో రాణించడం ద్వారా అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని తెలిపారు. ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తొలుత ప్రాబబుల్స్‌కు ఎంపిక చేసి సెలక్షన్ మ్యాచ్‌లు నిర్వహించి తుదిజట్టును ఎంపిక చేస్తామని తెలిపారు. అనంతరం బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల్లో ఎంపికలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన 60 మంది క్రీడాకారులను ప్రాబబుల్స్‌కు ఎంపిక చేశారు. సెలక్షన్ కమిటీ సభ్యులు వై. శివప్రసాద్, అబ్దుల్ రెహమాన్ ఫరూఖ్, కె. విష్ణుమోహన్ రావు, శ్రీకాంత్‌రెడ్డి, సాయిఈశ్వర్‌రెడ్డి, జగదీష్ కుమార్, భరద్వాజ్, సలీంబేగ్, ఎం.సాయిపృథ్వీ తేజ్, కోచ్‌లు ప్రసాద్, అబూబకర్ పాల్గొన్నారు.

వెంటాడుతున్న ఓటమి భయం!

- కారణాలు వెతుక్కుంటున్న టీడీపీ నేతలు
- తెరపైకి కడప, కమలాపురం, ప్రొద్దుటూరు నియోజకవర్గాలు
- వెన్నుపోట్లంటూ నివేదికలు సిద్ధం చేసుకున్న అభ్యర్థులు
- 29న చంద్రబాబును కలిసి ఫిర్యాదు చేయనున్న వైనం
- మదనపల్లె, తంబళ్లపల్లె అభ్యర్థులపై కేడర్ ఫిర్యాదు



సాక్షి ప్రతినిధి, కడప: తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు ఓటమి భయం పట్టుకుంది. అధినేత చంద్రబాబుకు వివరించేందుకు కారణాలు వెతుక్కుంటున్నారు. వెన్నుపోటు రాజకీయాలంటూ నివేదికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి ఇదే తరహా ఫిర్యాదు చేసిన నేపథ్యంలో మరో ఇద్దరు తెరపైకి వచ్చారు. ఈనెల 29న విజయవాడలో స్వయంగా కలిసి పరిస్థితి వివరించేందుకు సిద్ధం అయ్యారు. సక్సెస్‌ఫుల్ ప్రయత్నాలు చేసినా పార్టీ నేతల వెన్నుపోటుతో దెబ్బ పడిందనే అంచనాకు వచ్చారు.

- వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలు వైఎస్సార్‌సీపీకి కంచుకోటగా నిలుస్తున్నాయి. ఇదివరకు ఎన్నికలు ఏవైనా సరే ఫలితాలు ఏకపక్షంగా వచ్చాయి. 2024 ఎన్నికల ఫలితాలు అదేబాటలో ఉండనున్నాయి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం కళ్లముందు కనిపిస్తోంది. ఈ పరిస్థితిని పసిగట్టిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు ఓటమిపై సాకులు వెతుకుతున్నారు. సహచరులు ఆశించిన స్థాయిలో పనిచేయకపోగా, వెన్నుపోటు పొడిచారని నివేదికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే కడప, ప్రొద్దుటూరు, కమలాపురం టీడీపీ అభ్యర్థులు.. పార్టీ నేతలు వెన్నుపోటుకు పాల్పడ్డారని ఆరోపణలకు దిగారు. అదే విషయాన్ని అధినేతకు వివరించేందుకు సిద్ధమయ్యారు.

అన్నమయ్య జిల్లాలో ..

ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఆశించిన స్థాయిలో పోరాటం చేయలేదని, పోల్ మేనేజ్‌మెంట్ చేపట్టలేదనే అన్నమయ్య జిల్లా టీడీపీ కేడర్ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తోంది. ఇప్పటికే మదనపల్లె టీడీపీ అభ్యర్థి షాజహాన్‌పై రామసముద్రం మండల మాజీ జెడ్పీటీసీ మునివెంకటప్పతోపాటు ఆ మండల కేడర్ మూకుమ్మడిగా ఫిర్యాదు చేశారు. పోరాటం చేయకపోగా కేడర్‌ను అవమానాలపాలు చేశారని అధ్యక్షుడు చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. అలాగే తంబళ్లపల్లె, రాజంపేట అభ్యర్థులు జయచంద్రారెడ్డి, బాలసుబ్రమణ్యంపై కూడా కేడర్ ఫిర్యాదు చేయనున్నట్లు తెలుస్తోంది. ఆశించిన స్థాయిలో అభ్యర్థులు ఎఫర్ట్ పెట్టలేదని, పోల్ మేనేజ్‌మెంట్‌లో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపణలు చేస్తున్నారు. ఇరువురు టికెట్ తెచ్చుకునే క్రమంలో పార్టీపై చేసిన పోరాటం క్షేత్రస్థాయిలో చేయలేదనే ఆరోపణలు బాహాటంగా చెప్పుకొస్తున్నారు. అదే విషయాన్ని రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తున్నట్లు సమాచారం.

చంద్రబాబును కలిసేందుకు సన్నాహాలు...



టీడీపీ అధినేత చంద్రబాబును కలిసేందుకు ప్రొద్దుటూరు, కమలాపురం టీడీపీ అభ్యర్థులు నంద్యాల వరదరాజులరెడ్డి, పుత్తా కృష్ణచైతన్య రెడ్డి సిద్ధం అయ్యారు. ఆమేరకు బుధవారం విజయవాడలో కలవనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ప్రొద్దుటూరు ఇన్‌చార్జి గండ్లూరు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ప్రొద్దుటూరులోనూ, కమలాపురంలోనూ పార్టీకి వ్యతిరేకంగా పనిచేశారనే ఫిర్యాదు చేయనున్నట్లు తెలుస్తోంది. ఓవైపు వైఎస్సార్‌సీపీ నేతల మద్దతు పెంచుకుంటున్న తరుణంలో టీడీపీ నేతలు పార్టీకి దెబ్బకొట్టారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆమేరకు ఇరువురు ఆధారాలు సేకరించి నివేదికలు సిద్ధం చేసుకుంటున్నారు. ప్రొద్దుటూరులో ప్రవీణ్‌కుమార్‌రెడ్డితో సహా ఆయన సన్నిహితులు టీడీపీకి పనిచేయలేదని వరదరాజులరెడ్డి, స్వగ్రామం కోగటంలో టీడీపీకి వ్యతిరేకంగా పనిచేశారని చైతన్యరెడ్డి కలిసికట్టుగా ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం. మరోవైపు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి సైతం శల్యసారథ్యం వహించారని ఫిర్యాదు చేయనున్నట్లు తెలుస్తోంది. అధిష్టానం సూచనల మేరకు పార్టీ ఫండ్ అప్పగించడంలో కూడా విఫలయయ్యారని ఆధారాలతో అందజేయనున్నట్లు సమాచారం. కాగా, కార్పొరేటర్ ఉమాదేవి కుటుంబంపై ఇప్పటికే జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి ఫిర్యాదు చేశారు. పార్టీ విజయం కోసం పనిచేయలేదని ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే.

గజరాజుల గణన!



- ముమ్మరంగా ఏనుగుల జాడ సేకరణ
- ఇప్పటి వరకు 65 ఏనుగుల సంచారం
- శేషాచలంలో 100కి పెరిగే పరిస్థితి
- తమిళనాడు, కర్ణాటక సరిహద్దుల నుంచి రాకపోకలు
- ఆసియాటెక్ రకం ఏనుగులకు నిలయం
- గజరాజుల సంరక్షణ దిశగా చర్యలు



ఏనుగులు సంచరిస్తున్న శేషాచలం అటవీ ప్రాంతం

రాజంపేట: కేంద్ర అటవీశాఖ ఆదేశాల మేరకు అటవీశాఖ శేషాచలం దట్టమైన అటవీ ప్రాంతంలో గజరాజుల గణనను నిర్వహిస్తోంది. జిల్లాలో బాలపల్లె, కోడూరు, రాజంపేట, సానిపాయి రేంజ్‌లో గజరాజుల గణన ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలో శేషాచలం విస్తరించి ఉంది.

ఆసియాటెక్ రకం ఏనుగులు...

శేషాచలంలో ఆసియాటెక్ రకం ఏనుగులు తమ సంతతిని పెంచుకుంటూ వస్తున్నాయి. మగ ఏనుగులలో పెద్ద దంతాలు ఉంటాయి. పాక్షిక–సతత హరిత అడవులు, పొడిముళ్ల అడవులలో నివాసం ఏర్పరచుకుంటాయి. ఆసియా ఏనుగు ఆసియాలో అతి పెద్ద భూమి జంతువు. 70 సంవత్సరాలకంటే ఎక్కువగా జీవిస్తుంది. చెవులు చిన్నవిగా ఉంటాయి. 5వేల కిలో గ్రాముల బరువు ఉంటాయి.

ముమ్మరంగా ఏనుగల జాడ సేకరణ

శేషాచలంలో ఏనుగుల జాడ సేకరణను క్షేత్రాధికారులు, సిబ్బంది చేపట్టారు. ఇప్పుడు అటవీ సిబ్బంది అడవిబాట పట్టారు. ఏనుగులు వచ్చిపోయిన ప్పుడు పేడ, అడుగులు, వాటి సంచారపు ఆనవాళ్లను గుర్తిస్తున్నారు. ఏనుగులు ఎన్ని వచ్చాయి, ఎందుకు వస్తాయి లాంటి అంశాలతో గణన జరుగుతోంది.

తమిళనాడు, కర్ణాటక సరిహద్దుల నుంచి..

తమిళనాడు, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లోని దట్టమైన అరణ్య ప్రాంతాల నుంచి శేషాచలంలోకి ఏనుగులు గుంపులుగా ప్రవేశిస్తాయి. శేషాచలంలో సంచరించి తిరిగి ఎక్కడి నుంచి వచ్చాయో అక్కడికి వెళుతుంటాయి. ఈ విధంగా అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాలోని శేషాచలం అటవీ ప్రాంతాలలో ఏనుగుల సంచారం కొనసాగుతోంది.

100కి ఏనుగుల సంఖ్య పెరగవచ్చు..

శేషాచలంలో ఏనుగుల సంఖ్య వంద వరకు పెరగవచ్చని అటవీశాఖ వర్గాలు భావిస్తున్నాయి. వీటి సంఖ్య పెరిగే కొద్దీ అందుకు తగ్గట్టుగా అటవీశాఖ వాటి పరిరక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఏనుగులు సంచరించే ప్రాంతాల విస్తీర్ణం పెరిగితే ఎలిఫెంట్ లైన్‌గా గుర్తించాల్సి ఉంటుంది. శేషాచలంలో తమకు అనువైన ప్రదేశాలలో ఏనుగుల గుంపులు సంచరిస్తున్నాయి. ఆకలి, దాహార్తి లాంటి వాటి కోసం అవి అడవి దాటుతున్నాయి. అలా దాటకుండా అడవిలోనే అన్నీ ఉండేలా చేయాలంటే, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సహాయక చర్యలు చేపట్టేందుకు గజరాజుల గణన అటవీశాఖకు దోహదపడుతుంది.


ఎక్కడెక్కడ సంచరిస్తాయంటే...

శేషాచలం అటవీ ప్రాంతం రాజంపేట, తిరుపతి డివిజన్ పరిధిలో విస్తరించి ఉంది. ఏనుగుల గుంపులు చిత్తూరు జిల్లా నుంచి జిల్లా సరిహద్దు ప్రాంతంలో ఉన్న అటవీ ప్రాంతానికి వస్తూ పోతుంటాయి. పింఛా, చెయ్యేరు, గుంజననది నదీ పరీవాహక ప్రాంతాలకు కూడా ఏనుగులు వచ్చిపోతుంటాయి. గతంలో రైల్వేకోడూరు అటవీ రేంజ్ పరిధిలో ఏనుగులబావి, దొంగబండ, రాజంపేట రేంజ్ పరిధిలో ఈతకాయలబండ, తుమ్మలబైలు, పింఛా అటవీ పరిసర ప్రాంతాల్లోని అంబాని బావి సమీపంలో ఏనుగుల గుంపులు సంచరించాయి.

60 ఏనుగుల సంచారం

శేషాచలంలో విస్తరించిన దట్టమైన అటవీ ప్రాంతంలో 60 ఏనుగుల వరకు సంచరిస్తున్నాయి. వీటి కదలికలను అటవీశాఖ ఎప్పటికప్పుడు గుర్తిస్తోంది. గత గణన ద్వారా 60 ఏనుగులు ఉన్నట్లుగా అటవీ అధికారులు గుర్తించారు. అటవీ ప్రాంతంలో ఏనుగులకు తాగేందుకు సరైన రీతిలో వనరులు లేకపోతే అవి దాహార్తి కోసం.. అలాగే ఆకలి తీర్చుకునేందుకు అటవీ సమీపంలో ఉన్న తోటలపై పడుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. వేసవిలోనే ఏనుగుల గుంపు తోటలపైకి రావడం అధికమవుతోంది.

శేషాచలంలో లెక్కింపు ప్రక్రియ



శేషాచలంలో ఏనుగుల లెక్కింపు ప్రక్రియ జరుగుతోంది. వాటి సంచారం ఎక్కడెక్కడ అనేది కూడా తెలుసుకుంటున్నాము. ఏనుగుల సంఖ్య పెరిగి ఉంటుందని భావిస్తున్నాము. గణన ద్వారా ఏనుగుల జీవనానికి సంబంధించి ఏ విధంగా నిర్ణయాలు, వాటి అవసరాలు తదితర వాటిపై నిర్ణయం తీసుకునేందుకు ఈ గణణ దోహదపడుతుంది. శేషాచలంలో ఆసియాటెక్ ఏనుగులు ఉన్నాయి.

– తూమాటి నాగమణీశ్వరి, ఇన్‌చార్జి జిల్లా అటవీఅధికారి

క్లుప్తంగా

ఎయిమ్స్ పీజీ ఎంట్రెన్స్‌లో ప్రతిభ



నితీష్ కుమార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

జమ్మలమడుగు : ఎయిమ్స్ పీజీ ప్రవేశ పరీక్షలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు కె.శివరామిరెడ్డి కుమారుడు కె.నితీష్ కుమార్‌రెడ్డి ప్రతిభ చూపాడు. ఆల్ ఇండియా స్థాయిలో 14వ ర్యాంకు సాధించడంతో ఎస్‌టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకుడు గురుకుమార్ నితీష్‌కుమార్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గురుకుమార్ మాట్లాడుతూ ఎస్‌టీయు ఆర్గనైజింగ్ కమిటీలో ఉన్న శివరామిరెడ్డి కుమారుడు జాతీయ స్థాయి ర్యాంకు సాధించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు ప్రతాపరెడ్డి, ప్రధానోపాధ్యాయులు నాగిరెడ్డి, రంగేశ్వరరెడ్డి, మహమ్మద్ గౌస్, నాగభూషణంపాల్గొన్నారు.

ఐదు మట్టి ట్రాక్టర్ల పట్టివేత



పట్టుబడిన మట్టి ట్రాక్టర్లు

పెండ్లిమర్రి : మండలంలోని కొండూరు సమీపంలో పాపాఘ్ని నది ఒడ్డున మట్టిని అక్రమంగా తరలిస్తున్నట్లు కడప రూరల్ సీఐ నాగరాజు తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున దాడులు నిర్వహించి ఐదు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

ఇసుక లారీలు స్వాధీనం

ప్రొద్దుటూరు క్రైం:ఎర్రగుంట్ల రోడ్డులోని పెన్నా నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను ప్రొద్దుటూరు అటవీ శాఖ అధికారులు సీజ్ చేశారు. నైట్ పెట్రోలింగ్‌లో భాగంగా శనివారం అర్ధరాత్రి ఖాజీపేట, ప్రొద్దుటూరు రేంజ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. వెంకన్నపల్లె సమీపంలో రెండు లారీల్లో ఇసుక నింపుకొని తరలించడానికి సిద్ధంగా ఉండగా లారీలను పట్టుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్‌ఓ హేమాంజలి తెలిపారు.

గడ్డివామి దగ్ధం

నిమ్మనపల్లె : మండలంలోని రాచవేటివారిపల్లెలో ఆదివారం గడ్డివామి దగ్ధమై సుమారు రూ.30 వేల ఆస్తినష్టం జరిగింది. స్థానికుడు రవీంద్రనాథరెడ్డి పశువుల మేత కోసం వేయి కట్టలతో గడ్డివామి ఏర్పాటుచేశారు. గ్రామంలో టపాకాయలు పేల్చడంతో ప్రమాదవశాత్తు నిప్పు పడి గడ్డి వామిలో మంటలు రేగాయి. మదనపల్లె అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందించగా ఎస్ఐ నాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే అప్పటికే గడ్డి పూర్తిగా దగ్ధమైంది.

జోరుగా రియల్ వ్యాపారం



పల్లవోలు రెవెన్యూ పొలంలో అక్రమ నిర్మాణం, లే అవుట్ పనులు



ఖాదర్‌పల్లె చెరువు నుంచి రామసుబ్బమ్మ చెరువుకు నీరు అందించే వంకవాగు

- వ్యవసాయ భూముల్లోనే భవన నిర్మాణ పనులు
- అలవంక వాగులో ఆక్రమణలపై రైతుల ఫిర్యాదు

ప్రతి కుటుంబానికి కనీస విస్తీర్ణంలో తలదాచుకునే ఒక గూడునిచ్చేందుకు ఉపయోగపడాల్సిన నివాస భూమి నేడు కొందరికి విపరీతమైన లాభాలు గడించి పెట్టే పెట్టుబడిగా మారింది. వ్యవసాయ భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి దారులు వెతుక్కుంటున్నారు కొందరు. వ్యవసాయేతర భూమిగా కన్వర్షన్ చేయకుండానే విక్రయానికి పెట్టి మాయచేస్తున్నారు. పెద్ద ఎత్తున భూములను చదును చేసి అక్రమాలకు సిద్ధం చేస్తున్నారు. ఇది తెలియని లబ్ధిదారులు అయిన కాడికి డబ్బులు చెల్లించి నష్టపోతున్నారు.

చాపాడు : జిల్లాలో ఒకప్పుడు పట్టణాలు, వాటి పరిసర ప్రాంతాలకే పరిమితమైన రియల్ వ్యాపారం క్రమక్రమంగా గ్రామాలకు పాకింది. దీంతో వ్యవసాయ భూములు ప్లాట్లుగా మారిపోతున్నాయి. ఒప్పంద పత్రాలు రాసుకుని భూ దందా కొనసాగిస్తున్నారు. వ్యవసాయ భూములను రియల్ వ్యాపారానికి వినియోగిస్తే పన్ను చెల్లించాల్సి ఉంటుంది. వెంచర్లు ఏర్పాటు చేయాలంటే అంతర్గత రోడ్లు, సైడ్ కాల్వల నిర్మాణం, విద్యుత్ లైన్, తాగునీటి కుళాయిలు, తదితర మౌలిక వసతులు కల్పించాలనే నిబంధనలు ఉన్నాయి. ఇవేమి పట్టించుకోకుండా వ్యవసాయ భూములను యథేచ్ఛగా వెంచర్లుగా మార్చేస్తున్నారు. జాతీయ రహదారికి తాకుతూ వెళ్లడంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యవసాయ భూములు రియల్ భూములుగా మారాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా యథేచ్ఛగా రియల్ వ్యాపారం కొనసాగుతోంది. చాపాడు మండలంలోని మైదుకూరు - ప్రొద్దుటూరు జాతీయ రహదారి పక్కనే పల్లవోలు గ్రామ రెవెన్యూ పొలం ఉంది. ఇది వ్యవసాయ భూమి. అయితే కన్వర్షన్ చేయకుండానే రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రారంభించి కొందరు చదును చేయించి వెంచర్ వేశారు. ఇప్పటికే క్రయ, విక్రయాలు వేగంగా జరుపుతున్న రెవెన్యూ, పంచాయతీ అధికారులు అటువైపు వెళ్లిన దాఖలాలు లేవు.

పది రోజులుగా వెంచర్ పనులు

పల్లవోలు పంచాయతీ పరిధిలోని ఖాదర్‌పల్లె బస్టాపు సమీపంలో సర్వే నెంబరు 448/2లో 4.27 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ప్రొద్దుటూరుకు చెందిన ఇరగంరెడ్డి సిద్ధారెడ్డి, తల్లం రామ రత్నమ్మ పేరుతో ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరుకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇక్కడ వెంచర్ పనులు చేపట్టారు. నమూనాలు చూపుతూ క్రయ విక్రయాలు జరుపుతున్నారు. మైదుకూరు - ప్రొద్దుటూరు జాతీయ రహదారి పక్కనే కావడంతో వ్యవసాయేతర భూమిగా కన్వర్షన్ చేయలేదనే విషయం తెలియక చాలామంది కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. నిబంధనలు పట్టించుకోకుండా పనులు చేస్తున్నా ఎవరూ పట్టించుకోలేదు.

వాగులో ప్రహరీ నిర్మాణ పనులు

వందల ఏళ్ల నుంచి నీరు ప్రవహిస్తున్న అలకవంక వాగును ఆక్రయించి ప్రహరీ నిర్మిస్తున్నా పట్టించుకోవడం లేదు. సర్వే నెంబర్ 448/2లోని 2.27 ఎకరాల్లో రియల్ ఎస్టేట్ పనులు జరుగుతున్నాయి. దీని పక్కనే ఉన్న రామసుబ్బమ్మ చెరువు, పంట పొలాలకు సాగునీటిని అందించే అలవంక వాగు ఉన్నాయి. ఇక్కడా ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారు. ఖాదర్‌పల్లె సమీపంలోని పల్లవోలు, ఖాదర్‌పల్లె చెరువు నుంచి అలవంక ద్వారా రామసుబ్బమ్మ చెరువుకు నీరు చేరుతుంది. అక్రమ నిర్మాణాలతో నీరు ప్రవహిస్తే తమ పొలాలకు నష్టం వాటిల్లుతుందని వెంటనే పనులు ఆపాలని తహసీల్దారు భూషణంకు రైతులు ఫిర్యాదు చేశారు.

నిర్మాణాలు ఆపివేయిస్తున్నాం

సర్వే నెంబర్ 448/2లోని 4.27 ఎకరాలలో జరుగుతున్న రియల్ ఎస్టేట్ వెంచర్లు, వాగు ఆక్రమణ మా దృష్టికి వచ్చింది. రైతుల ఫిర్యాదు మేరకు ఇప్పటికే చేపట్టిన పనులను ఆపివేయిస్తున్నాం. ప్రభుత్వ నిబంధనల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

- ఇస్మాయిల్, వీఆర్వో

ఆటో డ్రైవర్ నిజాయితీ

రూ.18500 నగదున్న పర్సు ప్రయాణికుడికి అప్పగింత



పర్సు, బ్యాగ్‌లను అప్పగిస్తున్న కడప వన్ టౌన్ ఎస్ఐ రంగస్వామి

కడప అర్బన్ : తన చేతికి దొరికి నగదును తిరిగి పోగొట్టుకున్న వ్యక్తికి అందించి ఓ ఆటో డ్రైవర్ నిజాయతీ చాటుకున్నాడు. ఎస్సై రంగస్వామి అతడిని అభినందించారు. ఎస్సై వివరాల మేరకు.. కడప నగరంలోని పాత బస్టాండ్ పెట్రోల్ బంకు ఎదురుగా మెయిన్ రోడ్‌పై పాలెంపాపయ్య వీధిలో నివాసముంటున్న ఆటో డ్రైవర్ షేక్ షరీఫ్‌కు పర్సు దొరికింది. అందులో నగదు ఉండడంతో అతడు నిజాయతీగా ఆ పర్సును కడప వన్ టౌన్ ఏఎస్ఐ టి. శ్రీనివాసులుకు అప్పగించారు. సీఐ భాస్కర్‌రెడ్డి ఆదేశాల మేరకు కడప వన్‌టౌన్ ఎస్ఐ రంగస్వామి పర్సులో వున్న ఓటర్ ఐడీ ద్వారా ప్రొద్దుటూరుకు చెందిన రెడ్డి వెంకటచరణ్ తేజ్‌గా గుర్తించారు. అతన్ని ఆదివారం కడపకు పిలిపించిన ఎస్ఐ... ఆ పర్సును ఆటో డ్రైవర్ చేతులమీదుగా బాధితుడికి అప్పగించారు. ఆటో డ్రైవర్‌ను ఎస్ఐ, బాధితుడు అభినందించారు. అన్నమయ్య జిల్లా సంబేపల్లి మండలానికి చెందిన బి. మల్లికార్జున ఈ నెల 12న కడపకు వచ్చిన తన బ్యాగ్ పోగొట్టుకున్నాడు. అతని ఆచూకీ కనుగొన్న పోలీసులు పిలిపించి ఆదివారం ఎస్ఐ రంగస్వామి, తమ సిబ్బందితో అప్పగించారు.

సౌత్‌జోన్ క్రికెట్ పోటీలకు సిద్ధం



కేఎస్ఆర్ఎం మైదానం

- రేపటి నుంచి వన్డే మ్యాచ్‌లు ప్రారంభం
- 28 నుంచి జూన్ 3 వరకు నిర్వహణ

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం క్రీడా మైదానాలు వేదికగా ఏసీఏ సౌత్‌జోన్ సీనియర్ విభాగం అంతర్ జిల్లాల వన్డే క్రికెట్ మ్యాచ్‌లు ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్నాయి. జూన్ 3వ తేదీ వరకు ఈ మ్యాచ్‌లను నిర్వహించనున్నట్లు సౌత్‌జోన్ కన్వీనర్ ఎ.రెడ్డి ప్రసాద్ తెలిపారు. మ్యాచ్‌ల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

తేదీ	తలపడే జట్లు	మైదానం
28-05-24	అనంతపురం X కడప	కేఎస్ఆర్ఎం
28-05-24	చిత్తూరు X కర్నూలు	కేఓఆర్ఎం
29-05-24	కర్నూలు X నెల్లూరు	కేఎస్ఆర్ఎం
29-05-24	కడప X చిత్తూరు	కేఓఆర్ఎం
31-05-24	అనంతపురం X చిత్తూరు	కేఎస్ఆర్ఎం
31-05-24	కడప X నెల్లూరు	కేఓఆర్ఎం
01-06-24	చిత్తూరు X నెల్లూరు	కేఎస్ఆర్ఎం
01-06-24	అనంతపురం X కర్నూలు	కేఓఆర్ఎం
03-06-24	కడప X కర్నూలు	కేఎస్ఆర్ఎం
03-06-24	అనంతపురం X నెల్లూరు	కేఓఆర్ఎం

• కల్యాణ వైభోగమే..



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



కల్యాణోత్సవం అనంతరం మంగళ హారతి ఇస్తున్న వేదపండితులు



కోలాటం ఆడుతున్న భక్తులు

- భక్తులతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం

జమ్మలమడుగు : నారాపురస్వామి బ్రహోత్సవాలలో భాగంగా ఆదివారం సాయంత్రం భూదేవి, శ్రీదేవి సమేత నారాపుర వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకులు కల్యాణం జరుపగా.. ఆ వైభవం తిలకించేందుకు భారీగా భక్తులు తరలిరావడంతో ఆవరణంతా గోవింద నామ స్మరణతో మార్మోగిపోయింది. ఈ సందర్భంగా ఆలయంలో కోలాటం అలరించింది.

నేడు రథోత్సవం : స్వామి కల్యాణోత్సవ ఘట్టం పూర్తి కావడంతో సోమవారం రథోత్సవం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. రథాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.

వైభవంగా జోత్యుల మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరీదేవి

రాజుపాళెం : మండలంలోని టంగుటూరు గ్రామంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు జ్యోతుల మహోత్సవం వైభవంగా నిర్వహించారు. శనివారం రాత్రి ఆలయంలోని చౌడేశ్వరి దేవికి ప్రత్యేక పూజల అనంతరం జ్యోతుల ఉత్సవం ప్రారంభించారు. మహిళలు, ప్రజలు, పిల్లలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గ్రామస్థులు ఆదివారం అమ్మవారికి బోనాలు, కాయా కర్పూరం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.



జ్యోతులతో వెళ్తున్న భక్తులు

విద్యుత్ షాక్‌తో బాలిక మృతి



బ్రాహ్మణి మృతదేహం

వేంపల్లి : విద్యుత్ షాక్‌కు ఇందుకూరు బ్రాహ్మణి(12) ఆదివారం మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని ముత్తుకూరు గ్రామానికి చెందిన ఎర్రన్న, లక్ష్మీదేవి దంపతులకు కుమార్తె బ్రాహ్మణి, కుమారుడు ఇందువర్ధన్ ఉన్నారు. తల్లి లక్ష్మీదేవి ఇంట్లో దుస్తులు శుభ్రం చేసి, కుమార్తె బ్రాహ్మణిని దుస్తులు మిద్దెపై ఆరబెట్టాలని చెప్పింది. కుమార్తె మిద్దెపై దుస్తులు ఆరబెట్టే క్రమంలో అదుపు తప్పి విద్యుత్తు తీగలపై పడడంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందారు. 20 నిమిషాలైనా కుమార్తె కిందకు రాకపోవడంతో తల్లి లక్ష్మీదేవి మిద్దె పైకెక్కి బ్రాహ్మణి తీగలపై పడి ఉండడం చూసి కేకలు పెట్టింది. స్థానికులు విద్యుత్తు తీగలు తొలగించి హుటాహుటిన వేంపల్లి ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే బ్రాహ్మణి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సతీష్ కుమార్‌రెడ్డి, జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రగోపాల్‌రెడ్డి, పోలీస్ గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మానవత్వం చాటిన వైఎస్.అభిషేక్‌రెడ్డి



తీవ్రంగా గాయపడిన రామకృష్ణారెడ్డి



మృతి చెందిన నారాయణరెడ్డి

లింగాల : మండలంలోని ఇప్పట్ల గ్రామం సమీపంలో ద్విచక్ర వాహనం నుంచి కింద పడి ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. బిదినంచర్లకు చెందిన నారాయణరెడ్డి(70), బోనాలకు చెందిన రామకృష్ణారెడ్డి ద్విచక్రవాహనంలో ఇప్పట్ల మీదుగా తమ గ్రామానికి వెళ్తున్నారు.

ఇప్పట్ల సమీపంలోకి చేరగానే.. వాహనం అదుపు తప్పి బోల్తా పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. అంకెవానిపల్లె గ్రామంలో జాతరకు వెళ్లి పులివెందులకు వస్తున్న వైఎస్.అభిషేక్‌రెడ్డి ప్రమాదం చూసి గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ నారాయణరెడ్డి మృతి చెందారు. రామకృష్ణారెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగళూరుకు తరలించారు.

మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య

ముద్దనూరు : మండలంలోని ఉప్పలూరు గ్రామంలో ఓబులేసు(41) అనే వ్యక్తి మనస్థాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్ఐ ఆంజనేయులు సమాచారం మేరకు.. ఓబులేసుకు సుమారు 20ఏళ్ల కిందట ఉప్పలూరుకు చెందిన మహిళతో వివాహమైంది. వీరికి ఇరువురు సంతానం. గత కొంతకాలం నుంచి భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకుని మనస్థాపానికి గురయ్యాడు. శనివారం ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఇనుప పైపునకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో యాచకురాలి హత్య

ముద్దనూరు : సొమ్ము పంపిణీలో జరిగిన ఘర్షణలో మహిళను విచక్షణా రహితంగా రాళ్లతో కొట్టి చంపిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. యర్రగుంట్ల రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు సమాచారం మేరకు.. ముద్దనూరు రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో సింహాద్రిపురానికి చెందిన ఎరుకుల చిన్ని(35) నిత్యం యాచిస్తోంది. శనివారం రాత్రి సొమ్ము పంపణీ విషయంలో పాత రైల్వే స్టేషన్‌లో సమీపంలో మిగిలిన వారితో ఘర్షణ జరిగింది. గుర్తుతెలియని యాచకులు రాళ్లతో దాడిచేయడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డీజిల్ చోరీ కేసులో ముగ్గురు అరెస్ట్

పీలేరురూరల్ : డీజిల్ చోరీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ మోహన్‌రెడ్డి తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో నిందితుల అరెస్ట్ చూపిన అనంతరం సీఐ మాట్లాడుతూ చిత్తూరు జిల్లా శాంతిపురం మండలానికి చెందిన సురేష్‌కుమార్, నాగరాజు, కార్తీక్ రోడ్డు రోలర్, ప్రొక్లెయిన్ ట్యాంక్ నుంచి డీజిల్ చోరీ చేస్తున్నారన్నారు. ముగ్గురుని అరెస్ట్ చేసి వారి వద్ద 200 లీటర్ల ఆరు క్యాన్లు, రూ.18,500 నగదు, ఇనుక కమ్మి, రబ్బరు పైపు, వాహనం స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నరసింహుడు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారం

సివిల్ సర్వీసెస్ ర్యాంకర్ శ్రీనివాసులు



విద్యార్థులకు ప్రతిభా పురస్కారం అందజేస్తున్న శ్రీనివాసులు

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు పోవాలని సివిల్ సర్వీసెస్ ర్యాంకర్ కన్నెబోయిన శ్రీనివాసులు అన్నారు. స్థానిక పద్మశాలీయ కళ్యాణమండపంలో ఆదివారం ది బీసీ ప్రజా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో పది, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ చూపిన వారికి పురస్కారాలు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటూ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువకులు పత్రికల్లో ఎడిటోరియల్ పేజీ చదవాలని సూచించారు. ఎస్‌కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్.కృష్ణుడు మాట్లాడుతూ ఓటమితో కుంగిపోకుండా ధైర్యంగా ముందుకు పోవాలని చెప్పారు. ది బీసీ ప్రజాచైతన్య సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు మాట్లాడుతూ బీసీ విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 14 ఏళ్లుగా ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నామన్నారు. అనంతరం 40 మంది విద్యార్థులకు రూ.1.60 లక్షల నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సమాఖ్య ఉపాధ్యక్షుడు భాస్కర్‌యాదవ్, కోశాధికారి మడకా సంటెయ్య, భాస్కర్‌రావు, బీసీ నాయకులు పాణ్యం సుబ్బరాయుడు, కరుణాకర్ యాదవ్, వుట్టి వీరయ్య, మల్లెల భాస్కర్, జింకా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆలోచనాశక్తిని పెంచేందుకు కృషి

రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్



జేవీవీ నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ గేయానంద్

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రజల్లో ఆలోచనా శక్తి పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక కృషి చేస్తోందని జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పేర్కొన్నారు. స్థానిక నందిని క్లాత్ మార్కెట్‌లో ఆదివారం జన విజ్ఞాన వేదిక నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ ద్వారా సమాజాభివృద్ధి జరుగుతుందని, మూఢ నమ్మకాలను రూపుమాపాలని వివరించారు. చెకుముకి ప్రత్యేక విభాగాన్ని అభివృద్ధి చేస్తున్నామని, సైన్స్ ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ, జేవీవీ కార్యకర్తలకు నాయకత్వ శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు శాస్త్రీయ దృక్పథం అలవరచుకోవాలని, ప్రజల సమస్యలు, పరిష్కారాల గురించి అధ్యయనం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ వ్యవస్థాపక నాయకుడు డాక్టర్ నరసింహారెడ్డి, రాష్ట్ర కోశాధికారి రాజశేఖర్ రాహుల్, రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు, బాలబయన్న, మురళీ గుప్తా, సరస్వతి, రాజేష్, శివరాం, సునీత, డాక్టర్ రామమునిరెడ్డి, డాక్టర్. వరుణ్, డాక్టర్ చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.